కుల గణన పేరుతో విద్వేషాలకు కుట్ర

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం కుల గణన చేపట్టడాన్ని స్వాగతిస్తున్నప్పటికీ ప్రజల్లో ఈ కారణంతో విద్వేషాలకు రెచ్చగొట్టే పరిస్థితి ఈ గణనలో రూపుదిద్దుకుందని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ ఆరోపించారు. నగరంలోని సర్పంచ్‌ల సంఘం కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. కచ్చితంగా కులగణన చేయాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే గణన సమయంలో ఇతర వ్యక్తిగత వివరాలు ఎందుకు నమోదు చేస్తున్నారని ప్రశ్నించారు. కుల గణన పేరుతో ప్రత్యర్థులను గుర్తించి దెబ్బకొట్టాలని దురుద్దేశంతో ఎన్నికల ముందు ఇటువంటి కార్యక్రమాన్ని చేపట్టారని ఆరోపించారు. కుల గణనలో కేవలం కులాల వివరాలు తప్ప ఇతర అంశాలు తెలుసుకోవాల్సిన అవసరం లేదన్నారు. కుటుంబంలో ఆదాయంతో పాటు వారికున్న ఆస్తి, పాస్తులు వివరాలు ఎందుకు అడుగుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ యంత్రాంగం ఇందులో పావులుగా మారి అధికార పార్టీకి అనుకూలంగా పని చేయడం తగదన్నారు.

అంగన్వాడీలకు మద్దతుగా రాస్తారోకో

13 మంది నాయకుల అరెస్టు, విడుదల

రాస్తారోకో నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

రణస్థలం : రాస్తారోకో నిర్వహిస్తున్న కార్మిక సంఘాలు

టెక్కలి రూరల్ : ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

కొత్తూరు : మాట్లాడుతున్న సిర్ల ప్రసాద్

ప్రజాసంఘాల నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఇచ్ఛాపురం : మౌన దీక్ష చేస్తున్న అంగన్వాడీలు

సరుబుజ్జిలి : మానవహారం నిర్వహిస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అంగన్వాడీల వేతనాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటన చేయాలని కార్మిక, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా ప్రజా సంఘాల నాయకులు నగరంలోని డేఅండ్‌నైట్ కూడలి వద్ద ఉన్న కొత్త వంతెన వద్ద రాస్తారోకో శనివారం నిర్వహించారు. పోలీసులు రాస్తారోకోను భగ్నం చేసేందుకు మోహరించి 13 మంది నాయకులను అరెస్టు చేసి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షణ్ముఖరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కే నాగమణి, ఐద్వా జిల్లా కన్వీనర్ ఎ.లక్ష్మితో పాటు 1 3మందిని పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. ముందుగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 1,10,000 మంది అంగన్వాడీ అక్కాచెల్లెమ్మలు 40 రోజులుగా పోరాటం చేస్తున్నా... ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్రాంతి పండగ రోజుల్లోనూ వేలాది మంది అంగన్వాడీలు రోడ్డుపైకొచ్చి పోరాటం చేస్తున్నా ప్రభుత్వంలో చలనంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యయుతంగా జరుగుతున్న అంగన్వాడీల సమ్మెను ఎస్మా పరిధిలోకి తీసుకువచ్చి సమ్మెను నిషేధించడం అప్రజాస్వామికని అన్నారు. సమ్మె హక్కు, కార్మికుల హక్కుని చట్ట ప్రకారం 15 రోజుల ముందే సమ్మె నోటీసు ఇచ్చి సమ్మెకు వెళ్లారని గుర్తు చేశారు. సమస్యలు పరిష్కరించే వరకూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు, ఎఐటియుసి, రైతు సంఘం, ఐద్వా, యుటిఎఫ్, డిహెచ్‌పిఎస్, ఎస్ఎఫ్ఐ, ఎఐయుటియుసి స్ట్రీట్‌వెండర్స్, కళాసీ కార్మిక సంఘం, ఎన్ఎపిఎల్, భవన నిర్మాణ కార్మిక సంఘం, మత్స్య కార్మిక సంఘం, బిఎస్ఎన్ఎల్ తదితర సంఘాల నాయుకులు ఎస్.కిషోర్ కుమార్, పి.ప్రభావతి, కె.సూరయ్య, ఎం.రమణ, వై.గోపాలుడు, యు.సూర్య నారాయణ సిహెచ్.రాము, ఎన్.తౌడు, పి.పోలా రావు, సిహెచ్. సింహాచలం, ఎం.గోవర్ధనరావు, అల్లు సత్యన్నారాయణ పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద జ్యోతిరావుపూలే పార్కు వద్ద సమ్మె శిబిరంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి, కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు డి.జ్యోతి, డి.ముత్యాలమ్మ, కె.పార్వతి, కె.లక్ష్మి, సూర్యకుమారి, అప్పలనర్సమ్మ, అంజలిభాయ్, మల్లేశ్వరి, లక్ష్మి పాల్గొన్నారు.

రణస్థలం మండలం రామతీర్థాల కూడలి వద్ద నిర్వహించిన రాస్తారోకోలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, కౌలు రైతులు సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ వర్కర్స్ యూనియన్ నాయుకులు ఎం.ఈశ్వరరావు డి.ఎల్.నాయుడు, పి.రామకృష్ణ, యునైటెడ్ బ్రూవరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐ.నారాయణరావు, జె.గంగరాజు, ఎపి మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి వి.లక్ష్మి పాల్గొన్నారు.

ఎచ్చెర్ల మండలం చిలకపాలెంలో చేపట్టిన అంగన్వాడీల రాస్తారోకోలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, జిల్లా కార్యదర్శి ఎన్.వి.రమణ, రైతు సంఘం నాయుకులు టి.నందోడు, శ్యాంక్రగ్ పిస్టన్స్ వర్కర్స్ యూనియన్ ప్లాంట్-3 నాయుకులు షణ్ముఖరావు పాల్గొన్నారు. ముందుగా సమ్మె శిబిరాన్ని సందర్శించిన వామపక్ష నాయకులు సంఘీభావం తెలిపారు.

కొత్తూరు నాలుగు రోడ్ల కూడలి వద్ద చేపట్టిన రాస్తోరోకోలో సిఐటియు నాయకులు సిర్ల ప్రసాద్, నిమ్మక అప్పన్న, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆమదాలవలసలో నిర్వహించిన సమ్మెకు ఐలు రాష్ట్ర కమిటీ సభ్యుడు బొడ్డేపల్లి మోహనరావు సంఘీభావం తెలిపారు. అనంతరం ఐసిడిఎస్ కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయుకులు మొదలవలస లత, మాధవి, పి.లక్ష్మి, బి.జ్యోతిలక్ష్మి, ఎస్.రమణమ్మ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో అంగన్వాడీలు మౌన దీక్ష చేస్తూ నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు హైమ, బాలామణి, విజయ, జయ, కోమలి పాల్గొన్నారు.

టెక్కలిలో నిర్వహించిన రాస్తారోకోలో సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు, కొల్లి యల్లయ్య, రాజు పాల్గొన్నారు. అలాగే సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు తమ్మినేని వైకుంఠరావు, కె.దాలయ్య, పాలిని సాంబమూర్తి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెలర్స్ యూనియన్ నాయకులు రమణమ్మ, సుజాత, పద్మావతి, రమ, ఇందిర, అరుణ, ఉష పాల్గొన్నారు.

సరుబుజ్జిలి నాలుగు రోడ్ల కూడలి వద్ద చేపట్టిన ర్యాలీ, మానవహారం, తహశీల్దార్ వద్ద చేపట్టి ఆందోళనలో సరుబుజ్జిలి, బూర్జ మండలాలకు చెందిన అంగన్వాడీ వర్కర్ల సంఘ అధ్యక్షులు కూన జ్యోతి, సిఐటియు మండల నాయకులు అదపాక రాజేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం తహశీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

కోటబొమ్మాళి ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మెకు యుటిఎఫ్ నాయకులు ధర్మారావు, జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు ఇప్పిలి కామేశ్వరరావు, సిఐటియు నాయకులు ఈశ్వరరావు, నీలన్న, సుదర్శన్ సంఘీభావం తెలిపారు.

పొందూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరవదిక సమ్మె శనివారంతో 40వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.జ్యోతిలక్ష్మి, రమణమ్మ, అనురాధ పాల్గొన్నారు.

పలాసలో నిర్వహించిన రాస్తారోకోలో సిపిఎం నాయకులు ఎన్.గణపతి, సిపిఐ నాయకులు చాపర వేణుగోపాల్, ఎఐసిసిటియు నాయకులు బి.వాసుదేవరావు, డి.శ్రీనివాసరావు, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి ఎం.వినోద్‌కుమార్, ఐద్వా నాయకులు యన్.ఢిల్లేశ్వరి, ఎఐఎస్ఎఫ్ నాయకులు కె.రవి, ఎఐకెఎం నాయకులు ఎం.రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డి.భాస్కరరావు, మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు సిహెచ్.మురుగన్, ఎం.రవి, ఆటో యూనియన్ నాయకులు వి.కృష్ణారావు, ట్రాలీ రిక్షా సంఘం నాయకులు దుర్గారావు, లక్ష్మీనారాయణ, పిఒడబ్ల్యు జిల్లా కార్యదర్శి పి.కుసుమ, నాయకూలు ఈశ్వరమ్మ, బాలకృష్ణ పాల్గొన్నారు. అలాగే అంగన్వాడీలు చేపట్టిన ఆందోళనలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మంజుల, బి.సునీత, కె.జ్యోతి, చామంతి, బి.నిర్మల, జయలక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ నవీన్

31లోగా పెండింగ్ పనులు పూర్తి

ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పన పనులను ఈ నెల 31లోగా పూర్తిచేయాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో పలుశాఖల ఉన్నతాధికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో మరుగుదొడ్లలో మిగులు పనులు పూర్తి చేయాలన్నారు. రన్నింగ్ వాటర్ ఉండాలన్నారు. వాటికి సంబంధించి సూచిక బోర్డులు ప్రదర్శించాలన్నారు. పోలింగ్ కేంద్రంలో కావాల్సిన వెలుతురుకు లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఇంకా 22 పోలింగ్ కేంద్రాల్లో భవనాలకు మరమ్మతులు, 42 చోట్ల తాగునీరు, 43 చోట్ల విద్యుత్ సంబంధిత పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. వికలాంగులు వచ్చేందుకు వీలుగా 360 చోట్ల ర్యాంపులు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. మొత్తంగా 714 పనులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ నెలాఖరు నాటికి వాటిని కచ్చితంగా పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు. 15వ ఫైనాన్స్ నిధులను ఇందుకోసం వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో సమగ్ర శిక్ష అభియాన్ ఎపిసి రోణంకి జయప్రకాష్, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, డిఇఒ కె.వెంకటేశ్వరరావు, మున్సిపల్, పంచాయతీరాజ్, ట్రైబల్ వెల్ఫేర్ శాఖాధికారులు పాల్గొన్నారు.

రహదారి భద్రత నియమాలు తప్పనిసరి

రహదారిపై డ్రైవింగ్ చేసే ప్రతిఒక్కరూ రహదారి భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని నవీన్ అన్నారు. ఈ నెల 20 నుంచి వచ్చే నెల 19 వరకు జిల్లావ్యాప్తంగా రోడ్డు భద్రతపై వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారని అన్నాఉ. ఈ మేరకు కలెక్టరేట్‌లో రహదారి భద్రతా మాసోత్సవాలపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మీ క్షేమమే మీ కుటుంబానికి రక్షన్నారు. 16 ఏళ్ల కంటే తక్కువ వయసు గల వారు వాహనం నడుపుట చట్టరీత్యా నేరమన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడి వాహనం నడపకూడదని అన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అతివేగంగా వాహనాలను నడపడం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో ఉప రవాణా కమిషనర్, రవాణాశాఖ అధికారి ఎస్.ఎల్.వి.ఎం.దేవి, పరిపాలన అధికారి ఎన్.ఆర్.ఎం.రాజు, మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పి.వి.గంగాధర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా జడ్జి, ఎస్‌పి

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు

జిల్లా జడ్జి, ఎస్‌పి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

దర్యాప్తు అధికారులు మారుతున్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలనా పేర్కొన్నారు. నేర నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పోలీసు అధికారులను ఎస్‌పి జి.ఆర్.రాధిక ఆదేశించారు. ఎస్‌పి అధ్యక్షతన జిల్లా పోలీసు కార్యాలయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్, పోలీసు అధికారులతో శనివారం ద్వితీయ అర్థ వార్షిక నేర సమీక్షా సమావేశంలో జడ్జి పాల్గొన్నారు. కేసులు దర్యాప్తుపై పలు ముఖ్యమైన అంశాలపై దిశ నిర్దేశాలు చేశారు. కేసులు దర్యాప్తు, దర్యాప్తులో ఎదురయ్యే లీగల్ సమస్యలు నేర ప్రవృత్తి, నేర తరహా వంటి పలు అంశాలపై పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లతో ఎస్‌పి చర్చించారు. జడ్జి మాట్లాడుతూ చట్టాలపై అవగాహనపై నిపుణులతో ఆన్‌లైన్ సెమినార్ ద్వారా కొత్త అమండ్మెంట్స్, చట్టాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. పెండిగ్ కేసులకు వీలైనంత మేరకు సిసి నెంబర్ల మంజూరు చేస్తామని తెలిపారు. కేసు నమోదు, ఎఫ్ఐఆర్, రిమాండ్, ప్రాపర్టీ సీజ్, ముద్దాయిలు అరెస్టు, ఛార్జ్‌షీట్ దాఖలు అంశాలపై ఎదురయ్యే లీగల్ సమస్యలపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ ద్వారా మా దృష్టికు తీసుకువస్తే పరిష్కార చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్‌పి మాట్లాడుతూ గతేడాదిలో నేరాలు నివారణకు తీసుకున్న పటిష్టమైన చర్యలతో నేరాలు తగ్గుముఖం పట్టాయని తెలిపారు. నాన్ బెయిలబుల్ వారట్లు వీలైనంత మేరకు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఫైరింగ్‌లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ఎచ్చెర్ల: ఫైరింగ్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని మెలుకవలు నేర్చుకొని నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక అన్నారు. ఎచ్చెర్ల మండలం చిన్నరావుపల్లి వద్ద పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో శనివారం నిర్వహించిన ద్వితీయ అర్థ వార్షిక ఫైరింగ్ సాధనను శనివారం ప్రారంభించారు. ఈ క్రమంలో ఫైరింగ్ సాధన కోసం ఉయోగించే ఆయుధాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎప్పటికప్పుడు ఆయుధలను శుభ్రం చేసుకోవాలన్నారు. స్వయంగా ఫైరింగ్‌లో పాల్గొని సాధన చేసి లక్ష్యాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బంది ఆయుధాల పనితీరు గురించి, కొత్త తరహా ఆయుధాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో అనదపు ఎస్‌పిలు టి.పి.విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి, డి.బాలచంద్రారెడ్డి, జి.నాగేశ్వరరెడ్డి, ఎ.విజయకుమార్, ఎస్.వాసుదేవ్, జి.వి.ప్రసాద్, ట్రైనీ డిఎస్‌పి సిహెచ్.రాజా, ఎఆర్ డిఎస్‌పి కె.ఎస్.వాసన్, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

మార్చి 9న జాతీయ లోక్ అదాలత్

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జాతీయ లోక్ అదాలత్ మార్చి 9న నిర్వహిస్తున్నట్టు జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో, పోలీసులతో శనివారం జిల్లా కోర్టులో సమావేశాన్ని నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ చేయడానికి గల అవకాశాలపై చర్చించారు. పోలీస్ యంత్రాంగం ఇప్పటినుంచే అన్ని చర్యలు తీసుకొని కక్షిదారులకు లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడంతో కలిగే ఉపయోగాలను వివరించాలన్నారు. కేసులు రాజీ చేసుకునేందుకు ఇరు వర్గాలను సంసిద్ధులను చేయాలన్నారు. రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తే పోలీస్ అధికారులకు తీవ్రమైన నేరాలపై దృష్టి పెట్టే అవకాశం ఉంటుందన్నారు. చిన్న రాజీపడదగ్గ కేసులన్నీ రాజీ చేసుకునేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో అదనపు జిల్లా జడ్జిలు శ్రీదేవి, భాస్కరరావు, మహేంద్ర, ఫణికుమార్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి అనురాధ, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, అడిషినల్ ఎస్‌పి తిప్పేస్వామి, డిఎస్‌పిలు, సిఐలు, ప్రాసిక్యూషన్ తరపున మెట్ట మల్లేశ్వరరావు, ప్రభుత్వ న్యాయ వాది వినయ్ భూషణ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు నాగభూషణరావు, సుశీల పాల్గొన్నారు.

టిడిపి పూర్వ వైభవానికి కృషి

ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

టిడిపి పూర్వ వైభవానికి టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు. మెళియాపుట్టి కమలా కళ్యాణ మండపంలో జయహో బిసి నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రజలు చంద్రబాబు నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. వైసిపి ప్రభుత్వంలో ఏ ఒక్క వర్గమూ సంతృప్తిగా లేదని అన్నారు. అవుట్ సోర్సింగ్ నుంచి అంగన్వాడీల వరకు సమ్మె చేసేందుకు పూనుకోవడం ప్రభుత్వ వ్యతిరేకతకు నిదర్శనమని అన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని రైతులకు మూడు మండలాలు దాటి మిల్లులకు వస్తున్నాయని అన్నారు. దీనివల్ల రైతులకు రాత్రి, పగలు మిల్లుల వద్ద పడికాపులు కాయాల్సి వస్తోందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ మాట్లాడుతూ టిడిపితోనే పేదల సంక్షేమం సాధ్యమవుతుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి తగు బుద్ధి చెప్పాలని కోరారు. అంతకుముందు మెళియాపుట్టి మూడు కూడళ్ల వద్ద నుంచి కమలా కళ్యాణమండపం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్‌బాబు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు భాస్కర గౌడ, జిల్లా టిడిపి మహిళా ఉపాధ్యక్షులు బూర్ల లలిత కుమారి, కదంబల పైడిరాజు, చాపర మాధవరావు, బసవ పరమేశ్వరరెడ్డి, అగ్గాల శ్రీనివాసరావు, పడాల శ్రీను, మాలతి శ్రీధర్, ఉర్లాన వసంత్, బమ్మిడి భాస్కరరావు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురి చేరిక

మండలంలో రట్టిని, నడసంద్ర, వసుంధర గ్రామాలకు చెందిన పలువురు ఎంపీ సమక్షంలో టిడిపిలోకి చేరారు. రట్టిని మాజీ సర్పంచ్ రవీంద్ర జన్నా, నడసంద్ర మాజీ సర్పంచ్ సంతోష్‌తో పాటు పలువురు పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి ఎంపీ టిడిపిలోకి ఆహ్వానించారు.

ర్యాలీలో పాల్గొన్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

పాతర్లపల్లి పిహెచ్‌సి సందర్శన

రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ సుజాత

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని పాతర్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వైద్య ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ బి.సుజాత, డిఎంహెచ్ఒ డాక్టర్ బి.మీనాక్షి శనివారం సందర్శించారు. ఈ మేరకు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పిహెచ్‌సి కార్పొరేట్ ఆస్పత్రికి ధీటుగా సేవలు అందుతున్నాయని అన్నారు. ఒపి చాలా ఎక్కువగా ఉందంటే ఇక్కడ వైద్యులు, వైద్య సిబ్బంది రోగులకు పుష్కలంగా సేవలు అందిస్తున్నారని అర్థమవుతుందని అన్నారు. రోగులకు ప్రభుత్వాస్పత్రులపై పూర్తిస్థాయిలో నమ్మకం కలిగే విధంగా సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణచైతన్య, సిహెచ్ఒ వెంకటరావు, హెల్త్ అసిస్టెంట్ చిరంజీవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రద్దీగా విశాఖ బస్సులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

పండగ సీజన్ ముగియడంతో అంతా నివాస ప్రాంతాలకు పయనమవుతున్నారు. కనుమ మరుసటి రోజు నుంచే తిరుగు ప్రయాణాలు మొదలయ్యాయి. ప్రభుత్వం ఈ నెల 17న మరో మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించడంతో మరో మూడు రోజుల పాటు సొంత గ్రామాల్లోనే గడిపారు. సోమవారం స్కూళ్లు తెరవనుండటంతో చాలా మంది శనివారమే మూటాముళ్లు సర్దుకుని బయలుదేరారు. టెక్కలి, పాలకొండ, కొత్తూరు రూట్లలో సాధారణ రద్దీ నెలకొనగా విశాఖ రూట్‌లో మాత్రం విపరీతమైన రద్దీ నెలకొంది. శ్రీకాకుళం కాంప్లెక్స్‌లోని నాన్‌స్టాప్ కౌంటర్ల వద్ద భారీగా ప్రయాణికులు టిక్కెట్ల కోసం క్యూలో నిల్చొన్నారు విశాఖ వైపు వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లు, సూపర్ డీలక్స్‌లు, పల్లె వెలుగుల బస్సుల పరిస్థితి అలానే ఉంది. జనంతో కిక్కిరిసిపోయాయి. మధ్యాహ్నం 3 గంటల వరకు పెద్దగా రద్దీ లేకున్నా మూడు గంటల తర్వాత రాత్రి ఏడు గంట వరకు ఈ రద్దీ కొనసాగింది.

నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద బస్సు టిక్కెట్లు తీస్తున్న ప్రయాణికులు

సంచలన రాజకీయం చంచలం

వీక్షణం

నేటి రాజకీయాల్లో ఎన్నికల తరుణంలో వ్యూహాలు ప్రతి వ్యూహాలు సర్వసాధారణమైనావి. అలాంటి తరుణంలో మార్పులు, చేర్పులతో సంచలన రాజకీయాలు రాజ్యమేలుతున్నాయి. అదే సమయంలో అవి చంలనమవుతున్నాయి. ఆ నేపథ్యంలోనే జిల్లా రాజకీయాలను చూడాల్సి ఉంది. అధికార పార్టీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, ఇన్‌ఛార్జీల పేరుతో దశల వారీ ప్రకటిస్తుంది. నాలుగో విడత జాబితాలో జిల్లాలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులను, పార్లమెంట్ అభ్యర్థిని ప్రకటించింది. ఇవే ఖరారన్న పరిస్థితి నెలకున్నా ఆశ్చర్యపోనవసరం లేదు. అందరూ అనుకున్నట్టుగానే ఇచ్ఛాపురం అభ్యర్థిగా పిరియా విజయ పేరును ప్రకటించడం చూశాం. ఆ నియోజకవర్గంలో రెడ్డిక సామాజికవర్గం మద్దతును కూడగట్టేందుకు జెడ్‌పి చైర్‌పర్సన్ అభ్యర్థిని ప్రకటించడం చూశాం. దీంతో ఆ సామాజికవర్గంలో ముసలం ప్రారంభమైనట్టు తెలిసింది. జెడ్‌పి చైర్‌పర్సన్‌గా నారాయణమ్మ పేరును ప్రకటించడంతో టిక్కెట్ కోసం ఎదురు చూసిన వారు తీవ్ర నిరసకు గురైనట్టు తెలిసింది. టిక్కెట్ ఆశతో ఎదురు చూస్తున్న పి.రాజ్యలక్ష్మికి ఆగ్రహం కలిగించినట్లు తెలిసింది. ఆశ పడేవారు, నిరాశపడడం సహజం. కానీ, తనపై తప్పుడు రిపోర్టులను అధినేత ముందుకు తీసుకెళ్లి టిక్కెట్ రాకుండా చేశారని రాజ్యలక్ష్మి భావిస్తున్నట్లు తెలిసింది. ఆ తప్పుడు రిపోర్టులు తన వద్దకు చేరాయని, అధినేత ముందు వాటిపై తేల్చుకోవాలని సమాయత్తమవుతున్నట్టు తెలిసింది. ఎమ్మెల్యే అభ్యర్థిని మద్దతుగా నిలుస్తారన్న సామాజిక తరగతిలోనే ఇప్పుడు చీలికవచ్చిందని, మున్ముందు పరిణామాలు ఎలా ఉంటాయో చూడాల్సి ఉందని భావిస్తున్నారు.

టెక్కలి నియోజకవర్గం అభ్యర్థి ఎంపికలో రకరకాల చర్చలు, ప్రతిపాదనలు వచ్చినా చివరికి భూమి గుండ్రంగా ఉందన్న చందమైంది. మాట తప్ప మడవతిప్ప తిరిగి దువ్వాడ శ్రీనివాస్‌నే ప్రకటించడం పలువురిని ఆశ్చర్యపరిచింది. ఆ కుటుంబంలో రాజకీయ అంశాల్లోనూ సమన్వయం లేదని స్పష్టమైంది. ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి ఉంటారని, ఆమెకే టిక్కెట్ వస్తుందని అధినేత చెప్పారని నేరుగా దువ్వాడ శ్రీనివాస్ ప్రకటించారు. శ్రీనివాస్ అభ్యర్థి అని బహిరంగసభలో సిఎం జగన్ ప్రకటించిన మాటకు మడమ తప్పినట్లయ్యింది. అంతటితో ఆ కుటుంబం రాజకీయ అంశాల్లోనూ సర్దుకుపోవడానికి సిద్ధం కాలేదని ఆచరణలో తేలిపోయింది. టిక్కెట్ తనకు రాదని, తన కూతురుకు ఇవ్వాలని తల్లి వాణి అధినేత ముందు చెప్పిన విషయం పార్టీ వర్గాల ద్వారా బయటపడింది. ఈ వ్యవహారం కథ ముగిసేది కాదని, వారసులకు టిక్కెట్ ఇస్తే ఇక దానికి అంతముండదని అధినేత భావిస్తున్నట్టు తెలిసింది. ఈ జిల్లాలోనే ముగ్గురు నేతలు తమ వారసులకు టిక్కెట్ ఇవ్వాలని కోరడం అందరికీ తెలిసిన విషయమే. ఈ దాగుడుమూత వ్యవహారం చూసిన తరువాత తిరిగి దువ్వాడ శ్రీనివాస్‌కే టిక్కెట్ ప్రకటించడంలో చూపిన రాజకీయ చతురత ఎలాంటి ఫలితాలు వస్తుందో చూడాల్సి ఉంది. అదే సమయంలో పార్లీమెంట్ అభ్యర్థిగా పేరాడ తిలక్‌ను ప్రకటించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఎమ్మెల్యే టిక్కెట్ రేసులో ఉన్న ఆయనకు పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించడం పలువురు సీనియర్లు అవాక్ అయ్యారని తెలిసింది. గత ఎన్నికల్లో ఓటమికి గురైన ఇద్దరూ కుడి, ఎడమగా చేర్చి టిక్కెట్ ఇవ్వడం చర్చనీయాంశమైంది. వారిద్దరూ ఇప్పుడు కలసి తిరగడం ప్రారంభంచడం చూస్తున్నాం. ఈసారి ప్రకటించే ఇదే జాబితాలో జిల్లాకు సంబంధించిన మరికొన్ని నియోజకవర్గాలు ఉన్నట్టు తెలిసింది.

నరసన్నపేట నియోజకవర్గంలో వైసిపికి ఊహించని పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలున్నాయని ప్రచారం సాగుతోంది. సారవకోట మండలంలోని మాజీ మంత్రి, కృష్ణదాస్ కుటుంబానికి సంబంధించిన నేత ఒకరు జనసేన వైపు ఎదురు చూస్తున్నట్లు ఆ నియోజకవర్గంలో ప్రచారం మొదలైంది. వారిద్దరి మధ్య ఇటీవల కాలంలో మరింత దూరం పెరిగిందని, సారవకోట మండల పార్టీ కార్యక్రమం ఏర్పాటు విషయంలో గాని, ఆ మండలంలో చేపట్టిన కార్యక్రమాల్లోనూ అక్కడి నేతకు దూరంగా ఉంచడంతోనే ఇలాంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని పరిశీలకులు భావిస్తున్నారు. ఆయన గోడదూకకుండా నిలువరిస్తారా? లేదా? అన్నది చూడాల్సి ఉంది. ఎచ్చెర్ల, పాతపట్నం నియోజకవర్గాల్లో ఏమైనా మార్పులు ఉండవచ్చు తప్ప మిగతా నియోజకవర్గాల్లో యథాతథంగా ఉంటాయని ఆ పార్టీలో ప్రచారం ఉంది.

టిడిపి, జనసేన పొత్తు రాజకీయాలు కొత్త పుంతలు తొక్కే పరిస్థితి కనిపిస్తుంది. సామాజికవర్గం దృష్టితో ఎచ్చెర్ల గాని, పాతపట్నంలో గాని జనసేనకు కేటాయించే పరిస్థితి ఉంది. అదే విషయంలో ఉభయ గోదావరి జిల్లాలో తక్కువ సీట్లు కేటాయిస్తే ఈ జిల్లా వరకు జనసేన రకపోవచ్చునన్న చర్చ పార్టీలో ఉంది. నరసన్నపేట నియోజకవర్గంలో టిడిపి కొత్త రాజకీయాలకు తెరతీసే అవకాశాలు కనిపిస్తున్నట్టు తెలిసింది.

బగ్గు రమణమూర్తికి దాదాపు టిక్కెట్ ఖరైన సమయంలో ఎప్పటి నుంచో టిక్కెట్ కోసం ఆశతో ఎదురుచూస్తున్న డాక్టర్‌కు కొత్త అంటుకట్టి ఆశలను చిగురింపచేసే అవకాశం ఇవ్వాలన్న ఆలోచనలో టిడిపి అధినేత ఉన్నట్టు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. విజయనగరం ఎంపీగా వెళ్లాలని కళావెంకటరావును అధినేత చంద్రబాబు కోరినట్లు తెలిసింది. కానీ, ఆయన శాసనసభ బరిలో నిలుస్తానని చెప్పినట్లు తెలిసింది. ఎచ్చెర్ల నియోజకవర్గంలో రెండు పార్టీల్లోనూ గ్రూపులు రాజ్యమేలుతున్నాయి. పాతపట్నం నియోజకవర్గంలోనూ రెండు పార్టీల్లోనూ గ్రూపులు రకరకాల విన్యాసాలు చేస్తున్నాయి. ఏదేమైనా అభ్యర్థులను పూర్తిస్థాయిలో ప్రకటించిన తరువాత కచ్చితంగా గోడదూకడాలు ఉంటాయని, అయితే ఏ స్థాయిలో ఉంటాయన్నది ఇప్పుడే చెప్పలేమని సీనియర్ రాజకీయ నాయకులు చెబుతున్నారు. ఈ నెల 25న భీమిలిలో జరగనున్న ఉత్తరాంధ్ర సభ తరువాత అధికార పార్టీలో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో చూడాల్సి ఉంది.

- సత్తారు భాస్కరరావు

ఇళ్లపట్టాలను పంపిణీ చేస్తున్న మంత్రి అప్పలరాజు

నిర్వాసితులకు అండ

ప్రజాశక్తి- పలాస

రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్వాసితులకు అండగా వైసిపి ప్రభుత్వం ఉంటుందని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో శనివారం కాశీబుగ్గ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్వాసితులకు ఆర్‌డిఒ భరత్ నాయక్ అధ్యక్షతన రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేవంతెన నిర్మాణం కోసం అప్పటి ఎమ్మెల్యే దివంగత నేత హనుమంతు అప్పయ్య దొర హయాంలో పనులు జరిగినప్పటికీ గత ప్రభుత్వాలు విస్మరించాయన్నారు. నిర్వాసితులకు అండగా ఉండాలనే ఉద్దేశంతో ఇళ్లపట్టాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, తహశీల్దార్ ఎల్.మధుసూదనరావు, కౌన్సిలర్ దుర్గా శంకర్ పండా, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ శేషగిరిరావు, యువజన నాయకులు హరిప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

వచ్చే ఎన్నికలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి- రణస్థలం

ఎన్నికలకు సిద్ధం కావాలని, 2024 ఎన్నికల్లో మళ్లీ జగన్ మోహన్ రెడ్డిని సిఎంగా చేయడమే ముందున్న లక్ష్యమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం నాలుగు మండలాల నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ఈనెల 25న భీమిలిలో తొలి సమావేశంతో పార్టీ క్యాడర్ ప్రాంతీయ సమావేశాలను ప్రారంభించనున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు కష్టపడి పని చేసి తిరిగి అధికారంలోకి వచ్చేందుకు శ్రమించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, రణస్థలం మండలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, ఎచ్చెర్ల ఎంపిపి మొదలవలస చిరంజీవి, లావేరు, జి.సిగడాం ఎంపిపి ప్రతినిధులు రొక్కం బాలకృష్ణ, మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసి టొంపల సీతారాం పాల్గొన్నారు.

'ఐతమ్' అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల మరింత అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని పూర్వపు విద్యార్థులు అన్నారు. శనివారం పూర్వపు విద్యార్థుల సమ్మేళనంలో 2005 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు మాట్లాడుతూ ఐతమ్ నుంచి ఇప్పటి వరకు 19 బ్యాచ్‌ల విద్యార్థులు రిలీవయ్యారన్నారు. తమ కళాశాల వెబ్‌సైట్‌లో పూర్వపు విద్యార్థులు 14 వేల మంది ఉన్నారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎఎస్.శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ డి. విష్ణుమూర్తి మాట్లాడుతూ పూర్వపు విద్యార్థులు కొంత సమయాన్ని జూనియర్ల పురోభివృద్ధికి కేటాయించాలని కోరారు. పూర్వపు విద్యార్థుల కలయికలో విద్యార్థులు, డీన్లు, అసోసియేట్ డీన్లు, హెచ్‌ఒడిలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాధ్యతగా వ్యవహరించాలి

ప్రజాశక్తి- టెక్కలి

రోడ్డుపై ప్రయాణం చేసే ప్రయాణికులు, వాహనదారులు బాధ్యతగా వ్యవహరించాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ డి.సంజీవిరావు అన్నారు. స్థానిక ఆర్‌టిసి గ్యారేజ్‌లో శనివారం రోడ్డు భద్రతా మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదం జరిగితే ఏర్పడే నష్టాన్ని తెలుసుకోవాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. సమావేశంలో డిపో మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ బి.ఎస్.ఎన్.మూర్తి, మెకానికల్ ఇన్‌ఛార్జి కె.రామారావు, గజివిల్లి నాగభూషణం, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

బిల్లులు ఆమోదించాలని వినతి

ప్రజాశక్తి- టెక్కలి

ప్రభుత్వపరంగా ఉపాధ్యాయులకు అందాల్సిన బిల్లులను ట్రెజరీ అధికారులు ఆమోదించాలని కోరుతూ మండల యుటిఎఫ్ ఆధ్వర్యంలో సబ్‌ట్రెజరీ ఎటిఒ రామకృష్ణారావుకు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు జీతం బిల్లులు, సప్లిమెంటరీ బిల్లులు వంటి శాఖాపరమైన బిల్లులను ట్రెజరీ ద్వారా ఆమోదింపజేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో జిల్లా సహాధ్యక్షులు కురమాన దాలయ్య, మండలశాఖ కార్యదర్శి తమ్మినేని వైకుంఠరావు, అధ్యక్షులు పి.గణపతిరావు, రోణంకి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వైసిపి వికృత చేష్టలకు పరాకాష్ట

వజ్రపుకొత్తూరు: పలాస నియోజకవర్గంలో వైసిపి వికృత చేష్టలకు పరాకాష్టగా మారిందని టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి పుచ్చ ఈశ్వరరావు అన్నారు. శనివారం గరుడభద్రలో ధ్వంసం చేసిన టిడిపి ఫ్లెక్సీలను టిడిపి నాయకులతో కలిసి పరిశీలించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలు బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను వైసిపి నాయకులు నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో లొద్దభద్ర, గరుడభద్ర, కిష్టపురం, హుకుంపేట, కొండవూరు తదితర గ్రామాల్లో వికృతంగా ప్రవర్తిస్తూ ఫ్లెక్సీలను చించి వేయడం సమంజసం కాదన్నారు. దీనిపై పోలీసులకు గౌతు శిరీష ఫిర్యాదు చేశారని తెలిపారు. ఇదే పద్ధతి కొనసాగిస్తే పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సూరాడ మోహనరావు, మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, అరసవిల్లి ఉమామహేశ్వరరావు, బత్తిన మోహనరావు, కణితి సురేష్, శశిభూషణరావు ఉన్నారు.

నాయకులకు సన్మానం

పొందూరు: మండలం గోకర్ణపల్లి పంచాయతీ ఆవాస గ్రామమైన రంగనాథపేటకు చెందిన పవనపుత్ర యూత్ కమిటీ శనివారం సర్పంచ్ ప్రతినిధి చింతాడ వెంకట సత్యప్రసాద్, ఆయన సోదరుడు జీవరత్నం, భాస్కర్‌లను ఘనంగా సన్మానించారు. ఎన్నో దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని తమ గ్రామానికి ఈ మూడేళ్లలో అవసరమైన రహదారులు, తాగునీరు వంటి ఎన్నో మౌలిక వసతులను కల్పించి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపారని కొనియాడారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రతినిధి చింతాడ సత్యప్రసాద్ మాట్లాడుతూ గ్రామాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పేడాడ శ్రీను, పేడాడ సత్యం, పాపినాయుడు, సచివాలయం ఉద్యోగులు, పవనపుత్ర యూత్ కమిటీ సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

టెక్కలి వైసిపిలో కానరాని ఐక్యతారాగం!

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టిడిపికి కంచుకోటగా నిలిచిన టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గంలో వైసిపి జెండా ఎగురవేసేందుకు ఆ పార్టీ అధిష్టానం స్వప్నం మరికొంత కాలం స్వప్నంగానే మిగిలిపోయిన పరిస్థితులు కొనసాగుతున్నాయి. వైసిపి ఆవిర్భావం నుంచి టెక్కలిలో వైసిపికి నాయకత్వ లోపం కనిపిస్తుంది. గడచిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో వైసిపి ప్రభంజనం సృష్టించినప్పటికీ టెక్కలి నియోజకవర్గంలో టిడిపి కోట చెక్కుచెదరలేదు. ఇక్కడ వైసిపి బలపడం లేదన్న విషయాని కొస్తే బహు నాయకత్వం వల్లే తరచూ పార్టీనష్టపోతుందంటూ క్షేత్రస్థాయి క్యాడర్ నోట వినిపిస్తోంది. 2014 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా దువ్వాడ శ్రీనివాస్, 2019 ఎన్నికల్లో పేరాడ తిలక్ పోటీ చేసినప్పటికీ టిడిపి అభ్యర్థిగా కింజరాపు అచ్చెన్నాయుడు వరసుగా రెండు పర్యాయాలు విజయం సాధించారు. జిల్లాలో ప్రాధాన్యత క్రమ సామాజిక వర్గాల్లో ఒకటైన కాళింగులపై వైసిపి అధిష్టానం ప్రాధాన్యత ఇచ్చింది. టెక్కలి అభ్యర్థిగా పోటీ చేసిన పేరాడ తిలక్‌ను కాళింగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా పదవి ఇచ్చారు. అదే విధంగా శ్రీకాకుళం పార్లమెంటరీ స్థానం నుంచి దువ్వాడ శ్రీనివాస్‌ను అభ్యర్థిగా బరిలోదింపినా ఆయన కూడా ఓటమిపాలైనప్పటికీ, ఎమ్మెల్సీ స్థానం ఇచ్చి ప్రాతినిధ్యం కల్పించారు. టెక్కలి నియోజకవర్గానికి దువ్వాడ శ్రీనివాస్‌కు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించింది. అయినప్పటికీ నియోజకవర్గంలో రోజురోజుకు వైసిపిలో వర్గవిభేదాలు తారాస్థాయికి చేరతున్నాయి. వైసిపి నేతల మధ్యలో ఆధిపత్య పోరుతో కార్యకర్తలు నలిగిపోతున్నారు. 2024 ఎన్నికల్లో ఎవరికి టికెట్ ఇస్తే బాగుంటుందన్న అభిప్రాయం క్యాడర్‌లో బలంగా వినిపించనప్పటికీ అదిష్టానం అన్వేషణలో ఏం జరుగుతుందని కార్యకర్తల్లో ఆందోళన మొదలైంది. కేంద్ర మాజీమంత్రి కిల్లి కృపారాణి గతంలో వైసిపి జిల్లా అధ్యక్షురాలిగా ప్రాతినిధ్యం వహించినా ఆమెకు ప్రాధాన్యత ఇవ్వకుండా అణగదొక్కే ప్రయత్నం చేసిన పరిస్థితులు లేకపోలేదు. అయినప్పటికీ ఆమె వ్యక్తిగత చరిష్మా కోసం నిత్యం ప్రజలతో మమేకం అవ్వడానికి వివిధ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. కళింగ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న పేరాడ తిలక్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, రాజకీయాల్లో కొనసాగుతున్నప్పటికీ, ఎవరికి వారె యమునా తీరులా వ్యవహరించడంతో ఈ సంకేతాలు పార్టీ బలహీనపడుతుం దని చెప్పడానికి నిదర్శనం ఇంకేమి కావాలంటూ సీనియర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకు గ్రూపు రాజకీయాలతో బలహీన పడుతున్న వైసిపి తీరుపై క్షేత్రస్థాయిలో కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. టిడిపి మాత్రం చాపకింద నీరులా క్యాడర్‌ను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ముందుకు దూసుకువెళ్తుంది. తాజుగా ఎన్నికలు జరిగితే టిడిపి తరుపున పోటీచేసే అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడికి సుమారు 20వేల మెజార్టీ వస్తుందన్న ప్రచారం సాగుతుంది. వైసిపి ఇంతగా బలహీనపడడానికి

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కారణాలు విశ్లేషిస్తే టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పనిచేసిన దువ్వాడ వాణి అందర్నీ ఏకతాటిపై సమన్వయం చేసుకునేలా వ్యవహరిస్తున్నప్పటికీ క్యాడర్ సహాకరించకపోవడంతో మరలా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించి, పార్లమెంటు సమన్వయకర్త పేరాడ తిలక్ నియమించారు. దువ్వాడ తిలక్‌లు కలిసి తిరగనప్పటికీ అసమ్మతి రాగం జోరుగా వినిపిస్తుంది. జెడ్‌పిటిసి దువ్వాడ వాణి వర్గం సమావేశం ఏర్పాటు చేసి అసమ్మతి రాగం వినపించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మాజీ కేంద్రమంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి అసెంబ్లీ పార్లమెంట్ సమన్వయకర్తలు ప్రకటించిన తరువాత పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. దీనిపై అదిష్టానం అన్వేషణ చేసి ఒకతాటిపైకి తీసుకొస్తే తప్ప నియోజకవర్గం పోటీ ఇచ్చే పరిస్థితి కన్పించడం లేదు. మండలంలోని చాకపల్లి కొత్తూరు గ్రామంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు బగాది హరి అధ్యక్షతన టెక్కలి మండలానికి సంబంధించిన దువ్వాడ వాణి వర్గం నాయకులు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ నెల 25న భీమిలిలో సిఎం నిర్వహించనున్న సభలో నిరసన గళం విప్పిందుకు తీర్మానించినట్లు తెలిసింది.

పక్కాగా కులగణన

వజ్రపుకొత్తూరు : కులగణన చేస్తున్న సచివాలయ సిబ్బంది

ఆమదాలవలస: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కులగణన పక్కాగా నిర్వహించాలని, సచివాలయాల స్పెషల్ ఆఫీసర్, వైఎస్‌ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. శనివారం చీమలవలస సచివాలయ పరిధిలో సర్వే టీంలను సందర్శించి పలు సూచనలు చేశారు. ఇంటింటికి వెళ్లి ప్రతి వ్యక్తికి మొబైల్ అప్లికేషన్‌లో సమాచారం వివరంగా తెలియజేసి, పారదర్శకంగా సర్వే నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి రాము, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ సెక్రటరీ కూన వెంకట సత్యనారాయణ, వెలుగు క్లస్టర్ కో-ఆర్డినేటర్లు రమణ, చంద్రరావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

కవిటి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన పక్కాగా చేపట్టాలని ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ అన్నారు. మండలం రాజపురం సచివాలయం-1 పరిధిలో జరిగిన కులగణనలో ఎంపిడిఒ సూర్యనారాయణ రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ సచివాలయం సిబ్బంది పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉంటూ సర్వే చేపట్టాలని సూచించారు. ప్రతి ఇంటిని, ప్రతి వ్యక్తిని సందర్శించి కులగణన చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జానకిరావు, పిఎసిఎస్ డైరెక్టర్ ఎన్ని అశోక్, ఎంపిటిసి కృష్ణారావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: పురపాలక సంఘంలో కులగణన ముమ్మరంగా సాగుతున్నాయని మున్సిపల్ కమిషనర్ రమేష్ తెలిపారు. సర్వేలో భాగంగా శనివారం నీలపు వీధిలో వార్డు సెక్రటరీలు,

ఇచ్ఛాపురం : కులగణన సర్వే పరిశీలిస్తున్న కమిషనర్ రమేష్

ఆమదాలవలస : కులగణన సర్వేను పరిశీలిస్తున్న ఎపిఎం కూర్మారావు

వాలంటీర్లు చేపడుతున్న కులగణన సర్వేను పరిశీలించారు. నేటివరకు మొత్తం 2,448 ఇళ్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ సర్వేలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ కుమార్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: గ్రామాల్లో కులగణన ముమ్మరంగా సాగుతోంది. సీతాపురంలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించారు.

భీమిలి సభను బహిష్కరించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఈనెల 25న సిఎం జగన్మోహన్ రెడ్డి భీమిలిలో పాల్గొనే సభను ఉత్తరాంధ్ర ప్రజలు బహిష్కరించాలని తెలుగుశక్తి రాష్ట్ర అధ్యక్షుడు బి.వి.రామ్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని మరోసారి మోసం చేయడానికి జగన్మోహన్ రెడ్డి వస్తున్నాడని ప్రజలందరూ దీనిని గమనించాలని కోరారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజులను ప్రజలు ప్రశ్నించి భీమిలి సభను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. అనంతరం కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర పిసిసి ఉపాధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతిని కలిసి రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. నూతన పిసిసి అధ్యక్షులుగా షర్మిల ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని, మహిళగా ఆమె దృష్టికి మహిళల అదృశ్యం సంఘటనను తీసుకువెళ్లి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కోరారు. కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ టిడిపి కార్యదర్శి బోడెపూడి దొరబాబు, నరసన్నపేట సిబిఎన్ ఆర్మీ మెరుగు చరణ్ కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లుల స్వీకరణ

శ్రీకాకుళం అర్బన్: జిల్లా వ్యాప్తంగా విద్యుత్ బిల్లుల చెల్లింపునకు వీలుగా ఆదివారం కౌంటర్లను నిర్వహిస్తున్నట్టు ఇపిడిసిఎల్ ఎస్‌ఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల సౌకర్యార్థం సెలవు రోజుల్లోనూ చెల్లింపులకు అవకాశం కల్పిస్తున్నామని, ఈ సౌకర్యాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస: సొట్టవానిపేట సబ్‌స్టేషన్ పరిధిలో టౌన్ టు ఫీడర్ మరమ్మత్తులు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తెలిపారు. అలమాజీపేట పంప్ హౌస్, ఊసవానిపేట సబ్ స్టేషన్ 83 ట్రాన్స్ఫార్మర్, గేదెలవానిపేట తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని పేర్కొన్నారు. అసౌకర్యాన్ని వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

పలాస: కాశీబుగ్గలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ జి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. కాశీబుగ్గ ప్రాంతంలో హరి శంకర్ సినిమా హాల్, బిఎస్ఎన్ఎల్ కార్యాలయం, ఆంధ్రా బ్యాంక్ లైన్, మహారాణి పేట, న్యూ కాలనీ, పోలీస్‌స్టేషన్ వీధి, ఫిష్ మార్కెట్, గాంధీనగర్, గున్నేశ్వర నగర్, బాలకృష్ణ ఆస్పత్రి రోడ్డు, మల్లేశ్వర ఆస్పత్రి రోడ్డు, తిలక నగర్, ఎస్ఎండి పార్లర్ వెనుక, ఆర్ కె పోలీస్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

రిమ్స్ ఎడికి వాకర్స్ సన్మానం

శ్రీకాకుళం అర్బన్: రిమ్స్ వైద్య కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్‌గా నియమితులైన సిహెచ్.జోగిరాజును ఆదిత్య వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన శనివారం సన్మానించారు. నగరంలోని ప్రయివేటు హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వాకర్స్ గవర్నర్ పోలుమంతి ఉమామహేశ్వరరావు, వైద్య కళాశాల పరిపాలన అధికారి వెంకట సాయి మనోజ్, కార్యక్రమంలో ఫిజియో థెరపిస్టు డాక్టర్ శ్రీనివాస పట్నాయక్ , మన్యం జిల్లా అగ్నిమాపక అధికారి పి.వి.ఎస్.రాజేష్, కింగ్ జార్జ్ ఆస్పత్రి సిబ్బంది శరం, ప్రతీప్; నూకరాజు, ఫ్యూచర్ క్లౌడ్ కన్సల్ట్ ఫ్యూచర్ క్రౌడ్ కన్సల్టెంట్ సంస్థ అధినేత బి.వి.ఎస్.ప్రభు పాల్గొన్నారు. అనంతరం పేదలకు దుస్తులను పంపిణీ చేశారు.

జోగిరాజును సన్మానిస్తున్న వాకర్స్

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

టెక్కలి: జవహర్ నవోదయ వెన్నెలవలస పాఠశాల్లో 6వ తరగతి ప్రవేశానికి శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలో జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కేంద్రాలుగా ఎంపిక చేశారు. రెండు కేంద్రాల ద్వారా 484 మంది విద్యార్థిని, విద్యార్థులు హజరు కావాల్సి ఉండగా 52 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చీఫ్‌గా నందిగాం ఉన్నత పాఠశాల హెచ్ఎం హరిబాబు, బాలికోన్నత పాఠశాల చీఫ్‌గా శోభారాణి వ్యవహరించారు. టెక్కలి ఎంఇఒ దల్లి తులసీరావు రెడ్డి పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించారు.

ఇచ్ఛాపురం: స్వర్ణభారతి హైస్కూల్లో నవోదయ పరీక్షకు వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు హాజరై ప్రశాంత వాతావరణంలో పరీక్షను రాశారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా ఎస్.విశ్వనాథ్ వ్యవహరించారు. 360 విద్యార్థులకు 36 మంది గైర్హాజరైనట్టు స్వర్ణభారతి విద్యాసంస్థల చైర్మన్ చాట్ల తులసిదాస్ రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ గోవిందరావు ఆధ్వర్యాన పరీక్షలకు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పలాస: కాశీబుగ్గ ఉన్నత పాఠశాల, పలాస ప్రభుత్వ పాఠశాల, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ శనివారం 519 మంది విద్యార్థులు నవోదయ పరీక్షలకు హాజరయ్యారు. ఆపరీక్ష కేంద్రాలను ఎంఇఒలు సిహెచ్ శ్రీనివాసరావు, సిహెచ్ సత్యం పరిశీలిం చారు. పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లుగా చిన్నం నాయుడు, హేమారావు, ఎ.వీర్రాజులు వ్యవహరించారు.

కోటబొమ్మాళి: జవహర్ నవోదయ ప్రవేశపరీక్ష శనివారం ప్రశాతంగా ముగిసింది. మండల కేంద్రంలో జిల్లా పరిషత్ బాలుర, బాలిక ప్రభుత్వ పాఠశాలలో పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 336 మందికి 286 మంది, జిల్లా పరిషత్ బాలికల ప్రభుత్వ పాఠశాలలో 173 మందికి 159 మంది హజరైనట్టు ఎంఇఒ ఎల్.వి.ప్రతాప్ తెలిపారు.

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో చేరేందుకు నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ పరీక్షకు 8430 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ పరీక్షకు 7170 మంది హాజరు కాగా, 1260 మంది గైర్హాజరయ్యారని జిల్లా విద్యా శాఖాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు.

చెత్తచెదారంతో పేరుకుపోయిన రహదారి, డ్రెయినేజీలు

పడకేసిన పారిశుధ్యం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మేజరు పంచాయతీలో ప్రధాన రహదారి పారిశుధ్య లోపంతో దుర్గంధపు వాసన వేస్తుంది. సుమారు వారం రోజులుగా పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లింకపోవడంతో వారు విధులను బహిష్కరించారు. దీంతో పంచాయతీలో ఎక్కడ చెత్త అక్కడే కుప్పలు తెప్పలుగా పేరుకుపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువల్లో మురికి, చెత్తా పేరుకుపోవడంతో దోమలు, ఈగలు విలయతాండం చేస్తున్నాయి. దీంతో ప్రజలకు ఎటువంటి రోగాలు ప్రభలుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పంచాయతీ ఇఒల బదిలీల విషయమై అధికారులు ఊగిసలాడడంతో ప్రస్తుతం ఇక్కడ ఇఒగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న చింతాడ సన్యాసిరావును ఇక్కడ విధులు నుంచి తప్పించి గ్రేడ్‌వన్ పంచాయతీ కార్యదర్శి బి.నరేష్‌కు బాధ్యతలు అప్పగించారు. అయితే సన్యాసిరావుకు ఎటువంటి ఆదేశాలు, బదిలీ ఉత్తర్వులు ఇప్పటివరకు అధికారికంగా ఇవ్వలేదు. దీంతో నగేష్ విధుల్లో చేరక, సన్యాసిరావు ఎటువంటి బాధ్యతలు అప్పగించక, విధులు నిర్వహించక ఊగిసలాడుతున్నారు. కార్మికులు స్థానిక సర్పంచ్ కాళ్ల సంజీవరావును కలిసి పరిస్థితులు మెరపెట్టుకోగా నరేష్ బాధ్యతలు చేపట్టిన తరువాత మీ జీతభత్యాలకు సంబంధించి బిల్లులపై సంతకాలు చేస్తారని చెప్పడంతో పరిస్థితి మరింత జటిలమైంది. ఈ విషయమై తిరుపతిలో శిక్షణా కార్యక్రమంలో ఉన్న ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్‌ను వివరణ కోరగా బిఎల్‌పిఒతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కాగా పారిశుధ్య కార్మికులు జీతభత్యాలు లేక పండగ పూట కూడా కుటుంబాలతో పస్తులు ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

చంద్రబాబుతోనే గ్రామాల అభివృద్ధి

ప్రజాశక్తి- నరసన్నపేట

చంద్రబాబుతోనే గ్రామాలాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం బుడితి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టబోయే పథకాలను వివరించి మేనిఫెస్టో పోస్టర్‌ను అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసిసెల్ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, సర్పంచ్ పొన్నాన శంకరరావు, ఎంపిడిఒ మెండ మురళీకృష్ణ, మాజీ సర్పంచ్ సారవకోట రామారావు, కొల్లం అప్పారావు, పొదిలాపు వేణుగోపాలరావు, నిక్కు జనార్దన్ పాల్గొన్నారు.

పొందూరు: మండలం లోలుగులో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టిడిపి-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలుచేయనున్న పలు సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత కార్యదర్శి లోలుగు వెంకట్, టిడిపి నాయకులు చోళ్ల శ్రీనివాసరావు, లోలుగు సింహాద్రి నాయుడు, లోలుగు బాలకిషన్ పాల్గొన్నారు.



పొందూరు : పోస్టర్లను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

పలాస: రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అరాచకాలను సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, వైసీపీ పాలనకు స్వస్తి చెప్పాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. మండలం మాకన్నపల్లిలో శనివారం పల్లెపల్లెకు తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మందస మండలం బహడపల్లి గ్రామంలో భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అరాచకాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం బహడపల్లి గ్రామంలో వైసిపి నుంచి టిడిపిలో చేరారు. కార్యక్రమంలో నాయకులు జి.కె.నాయుడు, భావన దుర్యోధన, లాబ్బ రుద్రయ్య, దాసరి తాతారావు, సాలిన మాధవరావు, నవీన్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

నరసన్నపేట: పట్టణ పరిధి లచ్చుమన్నపేటలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ చొరవతో రూ. 7లక్షలతో సిసి రోడ్డు పనులకు మేజర్ పంచాయతీ సర్పంచ్ బురల్లి శంకర్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఈ సమస్యను ఎన్నోసార్లు అధికారుల దృష్టిలో పెట్టిన ఫలితం శూన్యమన్నారు. యువ నాయకులు ధర్మాన కృష్ణచైతన్య దృష్టిలో పెట్టగా తక్షణమే స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి వైశ్యరాజు కేశవరాజు, వార్డుసభ్యులు నేతింటి సింహాచలం, కార్యకర్తలు వైశ్యరాజు సత్యానంద్ రాజు, ఎం.శివ తదితరులు పాల్గొన్నారు.

పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ శంకర్



దీక్షల్లో పాల్గొన్న బెంతు ఒరియా ప్రతినిధులు

కొనసాగుతున్న దీక్షలు

ప్రజాశక్తి- కవిటి

తమజాతి గుర్తింపు, తమ బిడ్డల భవిష్యత్ భరోసా కోసం బెంతు ఒరియాలు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 24వ రోజుకు చేరుకున్నాయి. శనివారం దీక్షలో మజ్జిపుట్టుగ గ్రామానికి చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమజాతికి గుర్తింపు లభించే వరకూ, తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మోహన్ మజ్జి, దొండపాని మజ్జి, రుపో, గోపి బిసాయి, నిరంజన్, పూర్ణ, ప్రేమ్, మన్మథ, దుదిస్టి పాల్గొన్నారు.

పల్లెపల్లెకు టిడిపి

పలాస: మండలం రంగోయి, మాకన్నపల్లి గ్రామాల్లో పల్లెపల్లెకు టిడిపి కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పలాస ఇన్‌ఛార్జి గౌతు శిరిష మాట్లాడుతూ ఇప్పటి వరకు స్థబ్దతంగా ఉన్న కార్యకర్తలు, ఓటర్లు, వైసిపి అసంతృప్తి నాయకులు టిడిపిలో చేరాలంటే వారిని కలిపికొని వెళ్ళాలని, రాబోయే ఎన్నికల్లో అందరం కలిసి కట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విఠల్‌రావు, బమ్మిడి సంతోష్, గంగారాం, వంకల కూర్మారావు, కమలమ్మ, మున్న, సార జోగారావు, బి.రాజు, పాపారావు, శ్రీను, లోకనాథం పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘ ప్రధాన నీటి సరఫరా కేంద్రం అలమాజీపేట వద్ద విద్యుత్ స్తంభాలు నిర్వహణలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం పట్టణంలో మెట్టక్కివలస ప్రాంతాలకు తాగునీటి సరఫరా జరగదని పురపాలక సంఘ కమిషనర్ ఎం.రవిసుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి పురపాలక సంఘ సిబ్బందికి సహకరించాలని కోరారు.

శిరీషను సన్మానిస్తున్న జనసేన నాయకులు

శిరీషకు సన్మానం

ప్రజాశక్తి- పలాస

మండలం లొద్దభద్ర గ్రామానికి చెందిన జనసేన నాయకులు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఘనంగా సన్మానించారు. పలువురు జనసేన కార్యకర్తలు మాట్లాడుతూ అందరం కలిసి కార్యక్రమాలు విజయవంతం చేయాలని, సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను పట్టించుకోవద్దని శిరిషకు తెలిపారు. కార్యక్రమంలో తమ్మినేని గంగారాం, కిల్లి బాలకృష్ణ, కేదర్, నెయ్యిల వసంత, అనిల్, దిలీప్, చలపతి, వసంత, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదుకుంటున్న 'చైల్డ్‌లైన్'

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలో తెలుకుంచి గ్రామానికి చెందిన వివాహిత ఆత్మహత్య చేసుకోవడంతో అనాథలైన ఇద్దరు పిల్లలను ఆదుకునేందుకు చైల్డ్‌లైన్ సంస్థ చర్యలు చేపట్టింది. ఐసిడిఎస్ పీడీ అదేశాలతో జిల్లా బాలల రక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది కె.వి.రమణ, సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి, కో-ఆర్డినేటర్ జాస్మిన్ విషాద ఘటన తెలుసుకొని గ్రామాన్ని సందర్శించారు. తెలుకుంచి గ్రామానికి చెందిన వెంకట లక్ష్మి చెన్నైలో కూలిపనులు చేసుకుంటున్న సమయంలో 11 ఏళ్లక్రితం అక్కడ వేరేవ్యక్తితో పెరిగిన పరిచయం పెళ్ళి వరకు దారితేసింది. వీరికి శరణ్య, లిఖిత ఉన్నారు. ఐదేళ్ల కిందటి వరకు సుఖంగా సాగిన ఈ దంపతులు మధ్య కొన్ని కలతలు రావడంతో విడిపోయారు. బాలలు తల్లి వద్దనే పెరిగారు. ఈ నెల 15 తల్లి ఆత్మహత్య చేసుకోవడంతో బాలలు అనాథలయ్యారు. దీంతో చైల్డ్‌లైన్ బాలలను బాలసదనంలో చేర్చిస్తామని, బాలల రక్షణ, సంరక్షణకు ముందుంటామన్నారు. కార్యక్రమంలో దిలీప్, బాల సరస్వతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి ప్రసన్నలత

కుటుంబ వ్యవస్థలో స్త్రీలది ప్రత్యేక పాత్ర

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కుటుంబ వ్యవస్థలో స్త్రీలదే ప్రత్యేకపాత్రని, స్త్రీలు తల్లిదండ్రులను, అత్తమామలను సమానంగా చూసుకుంటే తర్వాత తరాలకు విలువలతో కూడిన జీవితాన్ని అందించగలుగుతామని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్న లత అన్నారు. శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో లింగ వివక్షత నివారణ, మహిళకు రక్షణ చట్టాల అమలపై ప్రత్యేక న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ మహిళలు వారి హక్కులను పొందడం కోసం ముందుకు రావాలని, అన్యాయం జరిగినపుడు మౌనంగా ఉండడం కూడా తప్పేనన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, ఇఒపిఆర్‌డి రామారావు, న్యాయవాదులు వెలమల అప్పలనాయుడు, పంచిరెడ్డి అర్జునరావు, ఐసిడిఎస్ పిఒ సిహెచ్ హైమావతి, పోలీసులు గణేష్, లక్ష్మణరావు, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ ఎస్.రాజేశ్వరమ్మ, ఎసిడిపిఒ రూపాలత పాల్గొన్నారు.

దుష్ప్రభావాలకు లోను కావద్దు

ఎచ్చెర్ల: విద్యార్థులు దుష్ప్రభావాలకు లోను కావద్దని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. వెంకటేశ్వర విద్యా సంస్థల్లో జండర్ సెన్సిటైజేషన్, యాంటీ ర్యాగింగ్‌పై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్నెట్‌ను ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని విచక్షణ రహితంగా వాడడం వల్ల అనేక దుష్ప్రభావాలకు లోనవుతారన్నారు. ఆధునిక సాంకేతికతను కేవలం జ్ఞానం పెంచుకోవడానికి మాత్రమే ఉపయోగించా లన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, వెంకటేశ్వర ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్స్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ చక్రవర్తి, ఎంబిఎ హెడ్ అఫ్ ది డిపార్ట్మెంట్ సత్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.